నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 నిజామాబాద్, సోమవారం 31 మార్చి 2025 NIZAMABAD



కోటగిరిలో కుస్తీ పడుతున్న మల్లయోధులు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎడ్లబండ్ల ప్రదర్శన

# పండుగ పూట విషాదం

- బట్టలు ఉతకడానికి వెళ్లి మృత్యుఒడిలోకి
- చెరువులో నీట మునిగి నలుగురు మృతి
- తల్లితోపాటు ముగ్గురు పిల్లలు దుర్మరణం
- కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలో ఘటన



మౌనిక (ఫైల్)



మైథిలి, అక్షర, వినయ్ (ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 30: కామారెడ్డి జిల్లాలో పండుగ పూట విషాదం నెలకొన్నది. చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యుఒడిలోకి వెళ్లారు. చెరువులో నీట మునుగుతున్న పిల్లలను రక్షించడానికి వెళ్లిన తల్లి సైతం నీట మునిగి మృతిచెందింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ హృదయవిదారకర ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం భిక్నూర్ పంచాయతీ పరిధిలోని వెంకటాపూర్ అగ్రహారంలో చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ అగ్రహారానికి చెందిన బొమ్మర్థి లింగయ్య (ఏసు)ఎల్లారెడ్డి పట్టణంలో హమాలీగా పనిచేస్తున్నాడు. అతడి భార్య మౌనిక(25) శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని పొలంలో నీళ్లు పారించి, అక్కడి నుంచి పెద్దచెరువు బ్యాక్ వాటర్‌లో బట్టలు ఉతుక్కొని వస్తానని ఇంటి నుంచి బయల్దేరింది. ఇంట్లో ఉన్న సవతి పిల్లలు మైథిలి (10), అక్షర (9), వినయ్ (7) తాము కూడా వస్తామని అడగడంతో వారిని కూడా వెంట తీసుకెళ్లింది. మౌనిక బట్టలు ఉతుకుతుండగా, ముగ్గురు పిల్లలు స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. చెరువులో తీసిన పూడిక మట్టివల్ల లోతుగా గుంతలు ఉండడంతో పిల్లలు అందులో పడిపోయారు. గట్టిగా కేకలు వేయడంతో వారిని రక్షించడానికి నీటిలోకి దిగిన మౌనిక సైతం వారితో పాటు నీటిలో మునిగిపోయింది.

## అర్ధరాత్రి మృతదేహాలు లభ్యం

ఎల్లారెడ్డిలో పని ముగించుకొని లింగయ్య సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. భార్యా పిల్లలు కనబడకపోవడంతో లింగయ్య, తన తండ్రి చిన్న లక్ష్మయ్యతో కలిసి వారి కోసం గాలించారు. వారి పొలం వద్ద గాలించి, చివరికి చెరువు బ్యాక్ వాటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నలుగురికి సంబంధించిన బట్టలు, చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా..అర్ధరాత్రి సమయంలో మౌనిక, మైథిలి, వినయ్ మృతదేహాలు బయటపడ్డాయి. ఆదివారం ఉదయం అక్షర మృతదేహం లభ్యమైంది. చెరువులో పూడికతీత గుంతలవల్లే లోతు తెలియక పిల్లలు నీట మునగడంతో వారిని రక్షించడానికి తల్లి కూడా వెళ్లి మృత్యువాతకు గురై ఉండవచ్చని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ దవాఖానకు ఆదివారం ఉదయం తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం అందరినీ కలిచివేయగా.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### పండుగ సెలవుల్లో ఇంటికి..

చెరువులో మునిగి మృత్యువాతకు గురైన ముగ్గురు పిల్లల తల్లి శ్యామల అనారోగ్యంతో 2021లో మృతి చెందింది. అప్పటి నుంచి ముగ్గురు పిల్లలు కలిసిమెలిసి ఉంటున్నారు. ఇద్దరు అక్కలకు తమ్ముడు అంటే ఎనలేని ప్రేమ. తమ్ముడిని కంటిరెప్పలా వారు చూసుకునేవారని కుటుంబీకులు తెలిపారు. మైథిలి ఆరో తరగతి, అక్షర ఐదో తరగతి, వినయ్ మూడో తరగతి చదువుతున్నారు. మైథిలి, అక్షర మెదక్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో హాస్టల్ ఉండి చదువుతున్నారు. ఉగాది, రంజాన్ పండుగలను పుస్కరించుకొని వరుసగా సెలవులు రావడంతో పిల్లలు గ్రామానికి వచ్చారు. ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. భార్యతో పాటు ముగ్గురు పిల్లలు మృతి చెందడంతో లింగయ్య దుఃఖసాగరంలో మునిగాడు.

## లింగయ్యకు మూడో పెండ్లి, మౌనికకు రెండో వివాహం

బొమ్మర్థి లింగయ్యకు ఏడాది క్రితం లింగంపేట్ మండలం శట్పల్లి గ్రామానికి చెందిన మౌనిక (25)తో వివాహమైంది. లింగయ్య మొదటి భార్య శ్యామల చనిపోగా, రెండో భా ర్య విభేదాలతో దూరమైంది. మొదటి భార్యతో మైథిలి, అక్షర, వినయ్ సంతానం కలిగింది. మౌనికను మూడో వివాహం చేసుకోగా, ఇదివరకే వివాహమై కూతురు ఉన్న మౌనికకు ఇది రెండో వివాహం. కొన్ని రోజుల క్రితం ఆమె కూతురు సైతం అనారోగ్య కారణాలతో మృతి చెందింది.



**నిజామాబాద్** జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు సత్యనారాయణ, మనోహర్‌రెడ్డి ఉన్నారు.
–ఖలీల్‌వాడి, మార్చి 30



ఉగాది వేడుకల్లో పాల్గొన్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## ఘనంగా ఉగాది వేడుకలు

తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగను ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. పండుగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో వేద పండితులచే పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. నూతన విశ్వావసు నామ సంవత్సరం ప్రజలకు ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలను అందిస్తుందని పండితులు పేర్కొన్నారు. పలు మండలాల్లో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో ఉన్న దుర్గమ్మ ఆలయ ఆవరణలో ఎడ్లబండ్ల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఉగాది పండుగను పురస్కరించుకొని పలు గ్రామాల్లో కుస్తీ పోటీలు నిర్వహించారు.
–సుభాష్‌నగర్, మార్చి 30




బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పంచాంగ శ్రవణం

### సీక్రెట్ కోడ్ వయా టెలిగ్రామ్ యాప్

ఐపీఎల్ సీజన్ ప్రారంభం కావడంతో బెట్టింగ్ అక్రమార్కులు రంగంలోకి దిగారు. తమ పాత పద్ధతిలోనే సీక్రెట్ కోడ్‌లు వాడుతూ బెట్టింగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. రహస్య సంకేతాలను వినియోగించడంతోపాటు వాట్సాప్‌కాల్‌లో ఈ తంతును పూర్తి చేస్తున్నారు. కొందరు వాట్సాప్ గ్రూపులు సైతం నిర్వహిస్తుండగా, మరికొంత మంది టెలిగ్రామ్ యాప్‌లను వాడుతున్నట్లుగా తెలుస్తోంది. బుకీల వద్ద పందేలు కాసే వారంతా కోడ్ భాషను వినియోగిస్తున్నారు. వారి దగ్గర ఒకసారి రిజిష్టర్ అయిన నంబర్ నుంచి ఫోన్ వస్తేనే మాట్లాడతారు. లెగ్ అనే పదం బెట్టింగ్ రాయుళ్లు వాడే కోడ్ భాషలో ప్రధానమైంది. ఎవరు ఎన్ని లెగ్‌లు తీసుకుంటే అన్నింటికీ లెక్కగట్టి మొత్తం చెల్లించాలి. గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న జట్టుపై బెట్టింగ్ పెడితే ఫ్లయింగ్, తక్కువగా ఉన్న జట్టుపై బెట్టింగ్ పెడితే ఈటింగ్ అనే పదాలను వాడుతున్నట్లు సమాచారం. మ్యాచ్ జరిగే రోజునే అప్పటికప్పుడు లావాదేవీలను నిర్వాహకులు పూర్తి చేస్తున్నట్లు తెలిసింది. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు 20 ఓవర్లు కావడంతో పలు రకాల్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు.

### టాస్ నుంచి మొదలుకొని ..

టాస్ నుంచి మొదలుకొని స్కోర్, జట్టు గెలుపు, ఓటములపై స్కోర్ చివరి నంబర్ ఇలా పలు రకాల్లో రూ.వంద నుంచి రూ.10వేల వరకు పందెం వేస్తున్నారు. గతంలో పందెం కోసం ప్రత్యేకంగా గదులు, లాడ్జిలను అద్దెకు తీసుకుని, అందులో టీవీతో పాటు ఇతర సదుపాయాలను ఏర్పాటు చేసుకునేవారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్‌లోనే నిర్వహిస్తున్నట్లు సమాచారం. శివారు ప్రాంతాల్లో ఉన్న గదుల్లో మకాం వేసి తంతును కొనసాగిస్తున్నారు. హోటళ్లలోనూ ఎవరికీ అనుమానం రాకుండా రూమ్‌లను అద్దెకు తీసుకుని రెండు, మూడు రోజులకోసారి హోటళ్లను మార్చుకుంటూ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్న ముఠాలు కూడా నిజామాబాద్‌లో ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




### ఓ వైపు యాప్‌లు, మరోవైపు ఐపీఎల్

కొన్నిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 'బెట్టింగ్'పై చర్చ నడుస్తున్నది. నిత్యం ఏదో ఒకచోట బెట్టింగ్‌లో తీవ్ర నష్టాలపాలవుతుండడం దీంతో ఆత్మహత్యలకు పాల్పడడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఓ వైపు బెట్టింగ్ యాప్‌లు, మరోవైపు ఐపీఎల్ బెట్టింగ్ వ్యవహారం వెరసి యువత జీవితాలను నాశనం చేస్తున్నాయి. ఈ ఊబిలో అడుగు బెడితే చాలు జీవితాలు సర్వనాశనమవుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బుల సంపాదించాలనే దురాశతో యువత అక్రమ మార్గం ఎంచుకుంటున్నది. తీరా జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో చేసేదేమీలేక, ఇంట్లోవారికి చెప్పుకోలేక తనువు చాలించుకుంటున్నారు. కండ్ల ముందే అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు కనిపిస్తున్నా, మార్పు కనిపించడం లేదు.
–నిజామాబాద్, మార్చి 30
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# బెట్టింగ్ వలలో యువత విలవిల!

- ఉమ్మడి జిల్లాలో జీవితాలను నాశనం చేస్తున్న 'దందా'
- సీక్రెట్ కోడ్ వయా టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా సమాచారం
- గతంలో బెట్టింగ్ నిర్వాహకులతో పోలీసుల చెట్టపట్టాల్...
- సమిధలుగా మారుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు
- గుట్టుగా సాగుతున్న ఐపీఎల్ బెట్టింగ్ వ్యవహారంపై కానరాని నిఘా!

**ఉమ్మడి** జిల్లాలోనూ బెట్టింగ్ యాప్‌లను ఆశ్రయించి బలవుతున్నారు. చిన్నపాటి ఆశతో బెట్టింగ్‌లో వేలు పెట్టి శరీరాన్ని దహించుకుంటున్నారు. నెల రోజుల క్రితం ఎడపల్లి మండలంలో ఓ యువకుడు బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టి తీవ్రంగా నష్ట పోయాడు. రూ.80లక్షలు అప్పుల పాలై వాటిని తీర్చలేక తనువు చాలించుకున్నాడు. గతేడాది ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలోనూ కామారెడ్డి జిల్లాలో ఓ యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. అనేక మంది కంటికి కనిపించకుండా బెట్టింగ్ వలలో చిక్కి విలవిల్లాడుతున్నారు. ఇంట్లో వారికి తెలియకుండా అప్పులు చేసి వాటిని తీర్చలేక సతమతమవుతున్నారు. చేసిన అప్పులను తీర్చడం కోసం దొడ్డి దారిలో లోన్ యాప్‌లను ఆశ్రయించి మరింతగా నష్టాల ఊబిలోకి చిక్కుకుపోతున్నారు. కొంత మంది చైన్ స్నాచింగ్, దొంగ తనాలకు పాల్పడుతుండగా, మరికొంతమంది గంజాయ్ స్మగ్లింగ్ చేస్తున్నారు. ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగ్ దందా మరోసారి బుసలు కొడుతున్నది. పోలీసులకు చిక్కకుండా కొందరు, ఖాకీలను మచ్చిక చేసుకుని మరికొందరు ఈ వక్రమార్గాన్ని ఎంచుకుని బెట్టింగ్‌లో దర్జాగా సంపాదిస్తున్నారు. సామాన్య యువతను రోడ్డున పడేస్తున్నారు.

### బెట్టింగ్‌లో చిక్కితే భవిష్యత్తు అంధకారమే..



ఈజీ మనీకి అలవాటు పడి చెడు మార్గాన్ని ఎంచుకోవద్దు. యువత సన్మార్గంలో నడవాలి. బెట్టింగ్‌లో పట్టుబడితే భవిష్యత్తు అంధకారం అవుతుంది. పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తారు. మా రికార్డుల్లో పేరు, చిరునామా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా, విదేశాలకు వెళ్లాల్సి వస్తే ఇబ్బందులు తప్పవు. బెట్టింగ్ ఆడుతూ లేదా నిర్వహిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు. చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తెచ్చే విధంగా ఉద్యోగాలు సాధించాలి. ఇలాంటి వ్యవహారాల్లో తల దూర్చవద్దని కోరుతున్న.

- పి.సాయి చైతన్య, నిజామాబాద్ పోలీస్ కమిషనర్
(హోలీ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సీపీ వ్యాఖ్యలు)

### గతంలో పోలీసులతోనే కుమ్మక్కు..

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ గ్రామీణ ప్రాంతాలకు వేగంగా అంటుకుంటున్నది. యువత పెద్ద మొత్తంలో అప్పులు చేస్తూ బెట్టింగ్‌కు పాల్పడుతున్నది. తల్లిదండ్రులు, పిల్లల వ్యవహారశైలిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. డబ్బుల కోసం వారు చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు బోలెడంతా వినోదం ఇస్తుండడంతో ఆట ఆరంభం నుంచి చివరి వరకు ఉత్కంఠను రేపుతున్న మ్యాచ్‌లను ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇదే సమయంలో బెట్టింగ్ బాబులు జోరుగా పందేలకు తెరలేపుతున్నారు. కామారెడ్డి జిల్లాలో ఐదేండ్ల క్రితం డీఎస్పీ, సీఐ, ఎస్సైలు నేరుగా బెట్టింగ్ బాబులతో చేతులు కలిపి అడ్డంగా ఏసీబీకి చిక్కారు. వక్రమార్గంలో డబ్బులు సంపాదించేందుకు అక్రమార్కులతో పోలీసులే చేతులు కలిపారు. ఇలాంటి ఖాకీలు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోనూ ఉండొచ్చనే అనుమానాలు కలుగుతున్నాయి. కొంత మంది పోలీసులైతే బెట్టింగ్‌లు కాస్తూ చెలరేగిపోతున్నట్లుగా ప్రచారం ఉంది. నిఘా వర్గాల నిర్లక్ష్యానికి తోడు పకడ్బందీగా పర్యవేక్షణ లేమి వల్లే ఈ వక్రమార్గం అంతులేని విధంగా వ్యాప్తి చెందుతున్నది. గతంలో నిజామాబాద్ నగరంలో వన్ టౌన్, టూ టౌన్ ఏరియాలో బెట్టింగ్ ముఠాల గుట్టు రట్టు చేసిన ఉదంతాలు అనేక ఉన్నాయి. ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేసుకుని నిర్వాహకులు అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పుడు ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన వేళ అలాంటి దందాపై మరింత నిఘా పోలీసులు పెంచాల్సిన అవసరం ఉంది.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఈద్గా వద్ద పూర్తయిన ఏర్పాట్లు

# నేడు ఈద్ ఉల్ ఫితర్

### ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి



సుభాష్‌నగర్, మార్చి 30 : ముస్లింలకు అత్యంత ప్రీతిపాత్రమైనది రంజాన్ మాసం. 30 రోజులుగా చేపట్టిన దీక్షలు ఆదివారం ముగిశాయి. నేడు (సోమవారం) రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్) జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా, అర్సపల్లి, గాంధీ చౌక్, గాజుల్‌పేట్, కంఠేశ్వర్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఈద్గాలను సామూహిక ప్రార్థనలకు సిద్ధం చేశారు. పండుగ సందర్భంగా పెద్దబజార్, గాంధీచౌక్, నెహ్రూపా ర్కు, బోధన్ బస్టాండ్ తదితర ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. రంజాన్ పండుగ నేపథ్యంలో జిల్లాకేంద్రంతో పాటు బోధన్ పట్టణంలో సీపీ సాయి చైతన్య పర్యటించారు. ఈద్గాలు, మసీదులను పరిశీలించారు.




# తాగునీటి సమస్య పరిష్కారం

- ఉగాది రోజున కొత్త పైపులైన్ ఏర్పాటు
- నీటి సరఫరా చేసిన అధికారులు

ఏర్గట్ల, మార్చి 30: మండలంలోని తొర్తి గ్రామం కొత్తప్లాట్ కాలనీలో కొన్నిరోజులుగా తాగునీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 40వేల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు నుంచి వేంకటేశ్వర గుడి వెనుకాల ఉన్న కొత్త ప్లాట్ కాలనీకి నిత్యం నీరు సరఫరా చేస్తారు. ఈ కాలనీలో సుమారు 40 కుటుంబాలు నివాసం ఉండగా..రెండు నెలలుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీవాసులు వాపోయారు.ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కాలనీ లో తాగునీటి సమస్యపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'తాగునీటి కోసం భగీరథ ప్రయత్నం' శీర్షికన ఈ నెల 27న కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. కాలనీలో పర్యటించి నీటి సమస్యను తెలుసుకున్నారు. ఆదివారం ఉగాది పండుగ రోజున అధికారులు దగ్గరుండి సిబ్బందితో కొత్త పైపు లైన్ వేయించారు. రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల తాగునీటి కష్టాలు తీరాయి. నీటి గోస తీర్చడానికి కృషి చేసిన నమస్తే తెలంగాణ దినపత్రికతోపాటు మిషన్ భగీరథ అధికారులకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

